సాక్షి కర్నూలు
సోమవారం । 29 । జనవరి । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానం నిత్యాన్నప్రసాద వితరణకు సికింద్రాబాద్ రాణి కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ గల్లా గుండయ్య కుటుంబ సభ్యులు రూ.25 లక్షలను విరాళమిచ్చారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవను నిర్వహించారు. పల్లకీలో ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



ఓటుందో లేదో చూసుకో!

మంచిప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటేవజ్రాయుధం. అందుకే ఓటు ఉందో లేదో ఎన్నికల పోర్టల్‌లో సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

1న కర్నూలులో ఉద్యోగమేళా



జాబ్ మేళా కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, తదితరులు

కర్నూలు సిటీ: నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీన కర్నూలులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నారు. ఈ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల నైపుణ్యాలను పెంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 18 నుంచి 35 ఏళ్ల వయస్సు లోపు నిరుద్యోగులు మేళాకు హాజరు కావచ్చొని తెలిపారు. పూర్తి వివరాలకు 8374231357, 8309283980, 6300009183 నంబర్లలో సంప్రదించాలన్నారు.

3న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు నిర్వహించనున్న ఏడు స్థాయీ సంఘ సమావేశాలకు ఆయా సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

నేటితో ముగియనున్న ఫీజు చెల్లింపు గడువు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ పరీక్షలకు తాత్కాల్ స్కీమ్ కింద ఫీజులు చెల్లించేందుకు నేటి(సోమవారం)తో గడువు ముగియనుంది. ఇప్పటి వరకు ఎవరైనా ఫీజు చెల్లించలేకపోతే ఆయా కాలేజీల్లో రూ.3 వేలు అపరాధ రుసుంతో సోమవారం సాయంత్రం 5 గంటలలోపు చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పదోన్నతి సీఐలకు పోస్టింగ్‌ల కోసం కసరత్తు

కర్నూలు: రాయలసీమ రేంజ్ పరిధిలోని వివిధ స్టేషన్లలో పని చేస్తూ ఇటీవల పదోన్నతి పొందిన 47 మంది సీఐలను జిల్లాలకు కేటాయించి వారికి స్టేషన్‌లో నియమించేందుకు పోలీసు శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ నాలుగు రోజుల క్రితం డీఐజీ సింథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా 8 మందిని కర్నూలు జిల్లాకు, 5 మందిని నంద్యాల జిల్లాకు కేటాయించారు. వారు రిపోర్టు చేసుకున్న వెంటనే స్టేషన్లకు నియమించేందుకు శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పదోన్నతి పొందిన వారిలో జయన్న, జయచంద్ర, జయలక్ష్మీ, కుళ్లాయప్ప, హాజీవలి, రామకృష్ణయ్య, శ్రీధర్, రామకృష్ణలను కర్నూలు జిల్లాకు నల్లప్ప, సీఎం రాకేష్, గోపినాథ్‌రెడ్డి, రమేష్‌కుమార్, రారాజు ఉన్నారు. వీరిని స్టేషన్లకు నియమించాల్సి ఉంది.

నకిలీకి ముకుతాడు

నాడు నకిలీల విపత్తు.. నేడు నాణ్యమైన విత్తు

అన్నదాతకు అండగా అగ్రిల్యాబ్‌లు

- నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో రైతులకు సేవలు అందిస్తున్న 13 ల్యాబ్‌లు
- రూ.9.13 కోట్లతో భవనాల నిర్మాణం
- విస్తృతంగా నాణ్యతా పరీక్షలు
- కర్నూలు జిల్లాలో 2,283, నంద్యాల జిల్లాలో 3,026 శాంపుల్స్‌కు పరీక్షలు



పత్తికొండలో నిర్మించిన వైఎస్‌ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. విత్తనం మొదలు పంట విక్రయాల వరకూ రైతన్నకు దన్నుగా నిలుస్తోంది. సీజన్‌కు ముందుగానే పెట్టుబడి సాయం అందిస్తోంది. అదనులో సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తోంది. కొరత లేకుండా ఎరువులు సరఫరా చేస్తోంది. ఉచితంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. పండించిన ప్రతి పంటకూ మద్దతు ధర ఇస్తోంది. వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులకు యంత్ర సామగ్రిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది. రైతులకు కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడద తప్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. దీంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి.

నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు

కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, కర్నూలులో మాత్రమే ఇంటిగ్రేడ్ ల్యాబ్‌లు అందుబాటులో ఉండేవి. ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్రిల్యాబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు మినహా మిగిలిన 13 నియోజకవర్గాల్లో అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9.13 కోట్లు ఖర్చుచేసింది. ప్రతిల్యాబ్‌కు ఏఓ, ఇద్దరు ఏఈఓలను నియమించింది. అన్ని అగ్రిల్యాబ్‌లలో విత్తనాలు, రసాయన ఎరువుల పరీక్షలు నిర్వహిస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు

వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ల ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికే నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీతో రైతులకు సరఫరా చేస్తోంది. అవి గాకుండా రైతులు ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారుల వద్ద కొనుగోలు చేసే వివిధ రకాల పంట విత్తనాలు, ఎరువుల నాణ్యతను అగ్రిల్యాబ్‌లలో ఉచితంగా పరీక్షించుకోవచ్చు. మార్కెట్లోకి వచ్చే ప్రతి విత్తన అవుట్‌పుట్‌ను, అలాగే రైతులు తాము పండించిన పంటలోని విత్తనాల నాణ్యతను పరీక్షించి తిరిగి విత్తుకొనే అవకాశం ఏర్పడింది. మార్కెట్లో కొనుగోలు చేసిన ఏ విత్తనాలనైనా అగ్రిల్యాబ్‌కు వెళ్లి పరీక్షించుకోవచ్చు, అనుమానం వచ్చిన ప్రతి రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను పరీక్షించుకొని నిర్భయంగా పంట సాగు చేసుకుంటున్నారు.

నాణ్యత పరీక్షలు ఇలా..

విత్తనాలు, రసాయన ఎరువులను అగ్రిల్యాబ్‌ల్లో పరీక్షించుకోగా, పురుగు మందులను కర్నూలు ల్యాబ్‌కు తరలిస్తారు. అగ్రిల్యాబ్‌లలో విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, భౌతిక స్వచ్ఛతలను పరీక్షించి 28 రోజుల్లో నివేదిక ఇస్తున్నారు. ఎరువుల్లో ఎన్‌పీకే కాంప్లెక్స్, ఎన్‌పీకే మిశ్రమం, సూక్ష్మ పోషకాల్లో తేమ శాతం, పోషకాల శాతం, కణ పరిణామాలను పరీక్షించి 14 రోజుల్లో రైతులకు నివేదికలు ఇస్తున్నారు. అగ్రిల్యాబ్‌లలో పరీక్షల కోసం నాలుగు రకాలుగా శాంపిల్స్ తీసుకుంటారు. రైతు భరోసా కేంద్రాల నుంచి తీసుకున్న విత్తనాలు, ఎరువులను అగ్రిల్యాబ్‌లలో ఉచితంగానే పరీక్షిస్తారు. అదే ప్రైవేట్ వ్యాపారుల విత్తనాలకు రూ.300, ఎరువులకు రూ.1500 ఫీజు చెల్లించి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది.



విత్తనాలు, ఎరువుల నాణ్యత ప్రమాణాలపై వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 13 ల్యాబ్‌ల్లో ఇప్పటి వరకు 5,323 శాంపుల్స్‌ను పరిక్షించి ఫలితాలు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 2,287, నంద్యాల జిల్లాలో 3,036 శాంపుల్స్ పరీక్షించారు.

టీడీపీ హయాంలో ఇలా..

ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను ధ్రువీకరించుకునే అవకాశం రైతులకు అందుబాటులో ఉండేది కాదు. దీంతో ఏది నాణ్యమైనది... లేని నకిలీదో తెలుసుకోలేక రైతులు నష్టాలు మూటకట్టుకునేవారు. విత్తనం మంచిది కాకపోవడంతో చాలా చోట్ల మొలక సరిగ్గా వచ్చేది కాదు. ఎరువులు మంచివి కాకపోవడంతో పైరు పెరుగుదలలో తేడాలు వచ్చేవి. నకిలీ పురగుమందులతో పంటల్లో చీడపీడలు మరింత పెరిగేవి. 2014–15 నుంచి 2018–19 వరకు ప్రధానంగా విత్తనాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి బీటీ పత్తి, మొక్కజొన్న, మినుము, కందులు, వరి తదితర పంటల సాగుకు సంబంధించి నకిలీలతో రైతులు నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రైతులు బీటీ పత్తి విత్తనాల్లో నకిలీల బారిన పడి తీవ్రంగా నష్టపోయారు.

ఉమ్మడి జిల్లాలోని ల్యాబ్‌లు. వాటిల్లో పరీక్షించిన శాంపుల్స్ వివరాలు

జిల్లా	మొత్తం ల్యాబ్‌లు	పరీక్షించిన శాంపుల్స్
కర్నూలు	6	2,287
నంద్యాల	7	3,036
మొత్తం	13	5,323

ల్యాబ్‌లు రైతుల్లో భరోసాను నింపుతున్నాయి



వైఎస్‌ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు రైతుల్లో భరోసా నింపుతున్నాయి. విత్తనాలు, ఎరువుల నాణ్యతపై అనుమానం వస్తే పరీక్షలు చేయించుకోవచ్చు. మేం అన్ని రకాల పంటలు సాగు చేస్తాం. ప్రైవేట్ వ్యాపారుల నుంచి తెచ్చుకునే విత్తనాలు, ఎరువుల నాణ్యతపై అనుమానాలు ఉంటున్నాయి. అందుబాటులో ల్యాబ్‌లు ఉండటంతో నాణ్యతను ధ్రువీకరించుకునే అవకాశం ఏర్పడింది. నేను వేరుశనగ విత్తనాలకు సంబంధించి శాంపుల్స్ తీసుకెళ్లి 2023 ఆగస్టు 4న ఆదోని ల్యాబ్‌లో ఉచితంగా నాణ్యతను చెక్ చేసుకున్నాను. విత్తనాలు నాణ్యతతో ఉన్నాయని నిర్ధారణ అయ్యింది. – వెంకటేష్, కుపటి రెవెన్యూ గ్రామం, ఆదోని మండలం

నష్టపోయే ప్రమాదం తప్పింది



గతంలో విత్తనాలు నాణ్యతతో లేకపోవడం వల్ల కోలుకోలేని విధంగా నష్టపోయాం. వైఎస్ ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక నియోజక వర్గాలవారీగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌లు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. రూపాయి చెల్లించకుండా విత్తనాల నాణ్యత ప్రమాణాలను ధ్రువీకరించుకోవచ్చు. మేము 2023–24లో వరి సాగు చేశాం. గతంలో దెబ్బతిన్న అనుభవాలు ఉండటం వల్ల మేం ప్రతి ఏటా విత్తనాల నాణ్యత ఆదోనిలోని వైఎస్‌ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ధ్రువీకరించుకుంటున్నాము. నాణ్యతతో లేకపోతే విత్తనాలను మార్చుకునే అవకాశం ఏర్పడింది. ల్యాబ్‌ల ఏర్పాటు వల్ల రైతులు నకిలీలతో నష్టపోయే ప్రమాదం తప్పింది.
– కె.ఈరన్న, చిన్న హరివాణం, ఆదోని మండలం

ఉచితంగా పరీక్షలు



ల్యాబ్‌ల్లో రైతులు తీసుకెళ్లే శ్యాంపుల్స్‌కు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. లూజు విత్తనాలకు మాత్రం పరీక్షలు చేయరు. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, విత్తనం స్వచ్ఛతను ధ్రువీకరిస్తారు. ల్యాబ్‌లకు ప్రభుత్వం ఆర్‌ఐడీఎఫ్ నిధులతో సొంతభవనాలు, పరికరాలు సమకూర్చింది. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా రైతులు సాగుకు ముందు నాణ్యతను పరీక్షించుకోవచ్చు. ల్యాబ్‌ల ఏర్పాటుతో నకిలీల బెడద చాలా వరకు తగ్గింది.
–పీఎల్ వరలక్ష్మి,
జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

పర్యాటకం.. ప్రగతి శోభితం

- పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.5.50 కోట్లతో అభివృద్ధి పనులు
- వాల్మీకి, బిల్ల సర్గ గుహల్లో వసతుల కల్పన
- నేడు గుహలను ప్రారంభించనున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి


కర్నూలు కల్చరల్/బేతంచెర్ల/ప్యాపిలి: రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. నూతన సొబగులను అద్దుకుని సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. వాల్మీకి, బిల్లసర్గ గుహలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. వీటిని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.5.50 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో పర్యాటక శాఖ గుహల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. పర్యాటకుల సందర్శనకు ముస్తాబు చేసింది. సోమవారం ఈ రెండు గుహలను మంత్రి బుగ్గన ప్రారంభించనున్నారు.

కార్యరూపం దాల్చిన హామీ..

ప్యాపిలి మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాల్మీకి గుహలు 2004లో వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో అధికారులు ఈ గుహలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చినా అత్యంత వ్యయప్రయాసలతో కూడిన ఈ పని ఆచరణకు నోచుకోలేదు. టీడీపీ, కాంగ్రెస్ నాయకులు వాల్మీకి గుహలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదు. ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆర్థికశాఖ మంత్రి కావడంతో మాటకు కట్టుబడి వాల్మీకి గుహల అభివృద్ధికి రూ. 3 కోట్లు మంజూరు చేసేలా కృషి చేశారు. గతంలో కేవలం తాళ్ల సాయంతో కిందికి దిగి గుహల అందాలను చూడాల్సి వచ్చేది. ప్రస్తుతం గుహల్లోకి దిగేందుకు మెట్లు ఏర్పాటు చేశారు. గుహల్లో ప్రవేశ ద్వారం నుంచే సహజసిద్ధంగా వివిధ ఆకృతుల్లో ఏర్పడిన శిలలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. ప్యాపిలి నుంచి గుడిపాడు, పీఆర్ పల్లె, నల్లమేకల పల్లె మీదుగా గుహలకు వెళ్లడానికి రహదారి మార్గం ఉంది.

రూ. 2.50 కోట్లతో అభివృద్ధి

బిల్ల సర్గ(ఎర్రజాల) గుహలు బేతంచెర్ల మండలం కనుమకింది కొట్టాల గ్రామానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్నాయి. పశువులు, గొర్రెల కాపరులు సుమారు 50 సంవత్సరాల క్రితం ఈ గుహలను గుర్తించారు. గుహ లోపలి భాగంలో నాలుగు వైపులా చిన్నచిన్న దారులు ఉన్నట్లు 35 సంవత్సరాల క్రితం వీటిని సందర్శించిన జర్మన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం విద్యార్థులు 1961లో ఈ గుహలపై పరిశోధన చేశారు. టీడీపీ హయాంలో ఈ గుహలు అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పర్యాటక శాఖ తరఫున రూ. 2.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం గుహలలో ఫుట్ పాత్‌వే తో పాటు లైటింగ్, రెస్టారెంట్, టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. రహదారి సౌకర్యాన్ని మెరుగు పరిచారు.



వాల్మీకి గుహల్లోకి దిగేందుకు ఏర్పాటు చేసిన మెట్లు

మరింత వన్నె తెస్తాయి


వాల్మీకి, బిల్ల సర్గ గుహలు ఉమ్మడి కర్నూలు జిల్లాకు మరింత పర్యాటక శోభను తీసుకొస్తాయి. తాళ్ల ద్వారా వాల్మీకి గుహల్లోకి వెళ్లి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారు. బిల్ల స్వర్గ గుహలు సైతం అద్భుతంగా ఉన్నాయి. ఈ రెండు గుహలను ఒకసారి సందర్శిస్తే జీవితంలో మరిచి పోలేని అనుభూతి కలుగుతుందనడంలో ఎలాంటి అతిశయో క్తి లేదు. పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. – బి. ఈశ్వరయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీ టూరిజం

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం: శ్రీశైలం భక్తులరద్దీతో కిటకిటలాడింది. శుక్రవారం గణతంత్రదినోత్సవం, శని, ఆదివారాలు కలిసిరావడంతో శ్రీశైలానికి భక్తుల తాకిడి అధికమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు శ్రీశైలక్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ పురవీధులు మొదలుకొని ఉచిత, ప్రత్యేక, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.



భక్తులతో కిక్కిరిసిన ప్రధాన క్యూలు




కొండారెడ్డి బురుజుపై ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ లేజర్ షో



లేజర్‌షోలో భారత క్రికెటర్ల దృశ్యాలు



రాట్నం తిప్పుతున్న జాతిపిత చిత్రం



త్రివర్ణ శోభితం

చారిత్రక సౌధం.. లేజర్' సౌరభం

చారిత్రాత్మక కట్టడం కొండారెడ్డి బురుజు సరికొత్త హంగులను అద్దుకుంది. ప్రతి రోజూ లేజర్ షో మెరిసిపోనుంది. ఈ బృహత్తర కార్యక్రమానికి ఆదివారం కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ శ్రీకారం చుట్టారు. టీడీపీ హయాంలో ఈ కట్టడానికి మెరుగులు దిద్దలేకపోయారు. లైటింగ్ షోను అమలు చేయలేకపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 2కోట్లు మంజూరు చేసి బురుజు వద్ద ఆధునికీకరణ పనులు చేపట్టింది. సందర్శకుల కోసం సౌకర్యాలు కల్పించింది. బురుజు ఎదురుగా ఖాళీ స్థలాన్ని అందమైన పార్కుగా తీర్చిదిద్దింది. రోడ్లను వెడల్పు చేసి బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేసింది. త్రీడీ లేజర్ షోకు అవసరమైన పరికరాలను సమకూర్చింది. ప్రతి రోజూ రాత్రి 7 నుంచి 10 గంటల వరకు లేజర్‌షో కొనసాగనుంది. సందర్శకులు కూర్చొని చూసే విధంగా బురుజు ఎదురుగా పార్కులో బల్లలు ఏర్పాటు చేశారు. ఆదివారం లేజర్‌షోలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, దేశ సార్వభౌమత్వాన్ని తెలిపే దృశ్యాలు చారిత్రాత్మక కట్టడంపై కనువిందు చేశాయి. సందర్శకులు ఈ దృశ్యాలను బంధించి తన్మయత్వం పొందారు.

–డి. హుస్సేన్, సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



లేజర్‌షోను తిలకించేందుకు వచ్చిన నగరవాసులు

క్లుప్తంగా

శ్రీమఠంలో బీజేపీ కర్ణాటక అధ్యక్షుడు



విజయీంద్రకు జ్ఞాపిక అందజేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం : శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనార్థం భారత జనతా పార్టీ కర్ణాటక అధ్యక్షుడు బీఎస్ విజయీంద్ర ఆదివారం మంత్రాలయానికి వచ్చారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్ర మూల బృందవనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీరాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు.

మృతదేహం లభ్యం




పురుషోత్తంగౌడు మృతదేహం

కర్నూలు: కర్నూలు జొహరాపురంకు చెందిన పురుషోత్తం గౌడు (23) మృతదేహం లభ్యమైంది. కర్నూలు మండలం మునగాలపాడు సమీపంలోని ఎస్ఎస్ ట్యాంకు వద్ద శనివారం తన సెల్‌ఫోన్‌తో సెల్ఫీ తీసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో పోలీసులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో నీటిలో నుంచి మత్స్యకారులు మృతదేహాన్ని బయటకు తీశారు. నిడ్జూరు గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపల వలలు, గాలలు వేసి గాలించగా మధ్యాహ్నం సమయంలో మృతదేహం గాలాలకు తగులుకోవడంతో బయటకు లాగారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై కర్నూలు అర్బన్ తాలుకా పోలీసులు కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. వారు మాట్లాడుతూ డ్యాంలో 0.461 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.



బిల్ల సర్గలోకి వెళ్లే ముఖ ద్వారం



గుహపై సాలీడు అల్లిక రూపం




బిల్ల సర్గ నుంచి యాగంటికి గుహకు వెళ్లే మార్గం

సోయగం.. స్వర్గధామం

చుట్టూ ఎత్తయిన కొండలు.. జాలువారే నీటి ధారలు, భారీ బండరాళ్లు.. రాళ్ల పొందికల్లో రూపాంతరం చెందిన వివిధ ఆకృతులు.. చూడటానికి రెండు కళ్లు చాలవు.. బేతంచెర్ల మండలంలోని బిల్ల సర్గ గృహలను పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పురాతన కాలంలో ఇక్కడ రుషులు తపస్సు చేశారని స్థానికులు చెబుతున్నారు. భారీ బండలతో రాజకోటలను తలపించేలా ఐదు ద్వారాలు (ఆర్చ్‌లు) స్వర్గాన్ని తలపించేలా ఏర్పడ్డాయి. ఇక్కడి నుంచి యాగంటికి వెళ్లడానికి గుహ మార్గం ఉందని కొందరు పరిశోధకులు చెబుతున్నారు. గుహలో సహజసిద్ధంగా ఏర్పడ్డ వివిధ రూపాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. సందర్శకులకు బాగా కనిపించే విధంగా వీటికి పర్యాటక శాఖ అధికారులు విద్యుత్తు దీపాలతో వెలుగులను ఏర్పాటు చేశారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు




సింహం ముఖ ఆకారంలో




వినాయక రూపం



పర్యాటకుల సందడి




గుహలో సరికొత్త లోకం



రాళ్లపై వృక్షాల రాజసం






గుహ ముందర లింగం ఆకారం



బిల్వ సర్గలో శిలలతో ఏర్పడ్డ రాక్షస బల్లులు, గజరాజు, మొసలి, నాగ ముద్రల ఆకృతులు

బిల్వ సర్గ గుహలకు వెళ్లే ద్వారాలు



ఆకాశమే హద్దుగా ఏర్పడిన సహజ సిద్ధ శిలల ఆకారాలు

యువత నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

ఆదోనిరూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని, నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్‌లో మినీ జాబ్‌మేళాను ఆదివారం నిర్వహించారు. ముందుగా సబ్‌కలెక్టర్‌తోపాటు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువతీ యువకుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గతేడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందం ప్రకారం ఆదోని ఫైవ్ స్టార్ హోటల్ ఏర్పాటైందన్నారు. మినీ జాబ్‌మేళాలలో 250 మంది యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఫైవ్ స్టార్ హోటల్ యజమాని పవన్‌కుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్‌కుమార్, పర్యాటకశాఖ డైరెక్టర్ గోపాల్, ఆంధ్రప్రదేశ్ ప్రవాస తెలుగు సొసైటీ సీఈఓ హేమలతరాణి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదన్, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

గతి తప్పిన ఎద్దుల బండి.. మహిళా రైతు మృతి



మృతురాలు గొల్ల రాములమ్మ (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎద్దుల బండి గతి తప్పడంతో మహిళా రైతు గొల్ల రాములమ్మ(44) మృతి చెందింది. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గొల్ల బ్రహ్మయ్య, గొల్ల రాములమ్మ దంపతులు రైతులుగా జీవనం సాగిస్తూ గ్రామ సమీపంలో 4ఎకరాల పొలం కౌలుకు తీసుకుని చామంతి పూల సాగు చేశారు. పూల దిగుబడులను గొల్ల బ్రహ్మయ్య అమ్ముకునేందుకు శుక్రవారం హైదరాబాద్ వెళ్లాడు. గొల్ల రాములమ్మ శనివారం పూల తోటలో పనిచేసుకునేందుకు తమ ఎద్దుల బండిని తోలుకుంటూ వెళ్లింది. పని ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణానికి ఎద్దులను బండికి కట్టి పగ్గాలను చేతబట్టి బండి ఎక్కు సమయంలో ఎద్దులు బెదిరి ముందుకు ఉరికాయి. ఊహించని రాములమ్మకు బండి ప్రదాన దూలాలు తగిలి గాయపడడంతోపాటు కింద పడిపోయింది. ఆమెపై నుంచే బండి చక్రం వెళ్లింది. తీవ్రంగా గాయపడిన రాములమ్మ అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు, విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందింది. పూల మ్మేందుకు వెళ్లిన భర్త విషయం తెలుసుకుని రాత్రి ఇంటికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించాడు. ఆదివారం భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ గ్రామానికి వెళ్లి విచారించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వెల్దుర్తి ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తనయుడు కంగాటి రామ్మోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ తనయుడు కృష్ణారెడ్డి, నర్సింగ్ కృష్ణారెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

10 మంది ఎస్ఐలకు స్థానచలనం

కర్నూలు: పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. నెలాఖరులోగా అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు పూర్తి చేయాలన్న కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు పోలీసు ఉన్నతాధికారులు విడతల వారీగా అధికారులకు స్థానచలనం కల్పిస్తున్నారు. తాజాగా 10 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ సింథిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
బాలనరసింహులు	కర్నూలు తాలూకా	కోడుమూరు
ఏపీ శ్రీనివాసులు	కోడుమూరు పీఎస్	నాగలాపురం పీఎస్
ఎం తిమ్మారెడ్డి	గోనెగండ్ల	సి బెళగల్
మన్మథవిజయ్	సి బెళగల్	కర్నూలు త్రీ టౌన్
పెద్దయ్య నాయుడు	ఆదోని టు టౌన్	హోళగుంద
పీఎస్ఎస్ నాగేంద్ర	హాలహర్వి పీఎస్	ఆదోని త్రీ టౌన్
రమేష్‌బాబు	చిప్పగిరి	మద్దికెర పీఎస్
మహమ్మద్ రజ్వాన్	మద్దికెర పీఎస్	చిప్పగిరి పీఎస్
ఎం నరేష్	వీఆర్ నంద్యాల	ఉలిందకొండ పీఎస్
ఎస్ నరేంద్ర	వీఆర్ నంద్యాల	హాలహర్వి పీఎస్

ఏనుగుల చెరువులో గుర్తుతెలియని మృతదేహం

● కర్ణాటక వాసిగా అనుమానం

శ్రీశైలం: దేవస్థానం పరిధిలోని ఏనుగులచెరువులో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం బళ్లారి పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా అనుమానించి అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఆలయానికి దర్శనార్థమై వచ్చే భక్తులకు బొట్లు పెడుతూ జీవనోపాధి పొందేవాడని స్థానికుల నుంచి సమాచారం సేకరించామన్నారు. మృతుడు వయస్సు 50 ఏళ్లు ఉంటుందని, రెండు రోజుల క్రితమే మృతిచెందడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వవైద్యశాలకు తరలించామన్నారు.

విచారణ ముమ్మరం

పాణ్యం: బీటెక్ విద్యార్థిని ప్రసవంపై తల్లిందడ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ అశోక్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తీవ్ర రక్తస్రావంతో మృతి చెందిన విద్యార్థినికి సంబంధించి ప్రత్యేక సాంకేతిక సిబ్బందితో విచారణ చేపట్టామన్నారు. విద్యార్థిని సెల్‌ఫోన్ కాల్‌డేటా, ఇతర గ్రూప్‌లు ఏమైనా ఉన్నాయా, ఈ ఘటనకు గల కారణాలపై విచారణకు ప్రత్యేకంగా టీమ్‌ను నియమించినట్లు చెప్పారు.

నేటి నుంచి అభిప్రాయ సేకరణ

కర్నూలు(అగ్రికల్చర్): రాబోయే ఐదేళ్ల కాలానికి విద్యుత్ డిమాండ్ ఎంత,డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి ఎలా చేయాలి.. విద్యుత్ సరఫరాలో నష్టాలను అధిగమించడం, రీటైల్ వ్యాపారం, టారిఫ్‌లను నిర్ణయించ డం వంటి వాటిపై ప్రజాభిప్రాయ సేకరణను ఏపీఎస్‌పీడీసీఎల్ మూడు రోజుల పాటు చేపట్టింది. ఆదివారం విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి దీనిపై విలే కరులతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. ఈ నెల 29 నుంచి 31 వరకు కర్నూలు,ఆదోని, నంద్యాల, డోన్‌లలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించనున్నట్లు చెప్పారు. అభిప్రాయాలను చెప్పేందుకు పారిశ్రామిక వేత్తలు, సంస్థలు, వివిధ వర్గాల ప్రజలు ముందుగానే సంబంధిత అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కర్నూలులో తానే అభిప్రాయయ సేకరణకు అందుబాటులో ఉంటానన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోకపోయినప్పటికీ అప్పటికప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించి ఆన్‌లైన్‌లో అభిప్రాయాలు వెల్లడించవచ్చన్నారు. ఉమ్మడి కర్నూలు జిలాకు రోజూ 18 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ అవసరమవుతుందన్నారు.

ఓటు ఉందో.. లేదో చూసుకోండి

● లేకుంటే నమోదు చేసుకునేందుకు అవకాశం
● ఇటీవలే తుది ఓటరు జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
● జిల్లాలో మొత్తం 20,14,797 మంది ఓటర్లు
● అనుమానాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 1950కు ఫోన్ చేయవచ్చు

కర్నూలు(సెంట్రల్): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిది. ఓటుతో మంచి పాలకులను ఎన్నుకోవచ్చు. ఈ క్రమంలో ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో సరి చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇటీవలే జిల్లా అధికారులు తుది ఓటరుజాబితాను విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం కర్నూలు జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 20,14,797 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 10,19,597, పురుషులు 9,94,885, ఇతరులు 312 మంది ఉన్నారు. జాబితాలో పేరు ఉందో లేదో ఇలా చూసుకోవచ్చు...

➡ కంప్యూటర్ లేదంటే సెల్‌ఫోన్‌లో voterportal. eci. gov. in అనే వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వగానే సెర్చ్ ఎలక్ట్రోల్ రోల్ అని ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే సెర్చ్ బై డిటేల్స్, సెర్చ్ బై ఎపిక్, సెర్చ్ మొబైల్ అనే మూడు సబ్ టైటిల్స్ లభిస్తాయి.

➡ సెర్చ్ బై డిటేల్స్ అనే దానిపై క్లిక్ చేస్తే పేరు, తండ్రి పేరు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం పేరు నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు వస్తాయి.

➡ సెర్చ్ బై ఎపిక్‌లోకి వెళ్లి ఫొటో గుర్తింపు కార్డు సంఖ్య(ఎపిక్ నంబర్)ను ఎంటర్ చేస్తే జాబితాలో పేరు ఉందా లేదా ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో మీ ఓటు ఉంది? సీరియల్ నంబర్ వివరాలు కనిపిస్తాయి.

➡ సెర్చ్ బై మొబైల్‌లోకి వెళ్లి దరఖాస్తులో మీరు పేర్కొన్న ఫోన్ నంబర్ ఇస్తే ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేస్తే కావాల్సిన వివరాలు డిస్‌ప్లే అవుతాయి.

➡ ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పోలింగ్ కేంద్రాల వారీగా కూడా ఓటర్ల జాబితాను పొందవచ్చు. ఇందుకోసం voterhelapline వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. పై భాగంలో పీడీఎఫ్ ఎలక్ట్రోరల్ రోల్ అనే అంశంపై క్లిక్ చేస్తే అసెంబ్లీ నియోజకవర్గాల వారీ ఎస్ఎస్ఆర్-2024 ఓటర్ల వివరాలు ఉంటాయి. అందులో ఏ నియోజకవర్గం, ఏ మండలం, ఏ గ్రామం, ఏ పోలింగ్ బూత్ ఆధారంగా కూడా మన ఓటు జాబితాలో ఉందో లేదో పరిశీలన చేసుకోవచ్చు.

➡ ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో సరిచూసుకోవడానికి బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించి కూడా తెలుసుకోవచ్చు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక అధికారి ఉండి ఓటరు నమోదు వివరాలను పర్యవేక్షిస్తుంటారు. ఆయన దగ్గర కూడా ఫైనల్ ఓటరు జాబితా ఉంటుంది. దాని ప్రకారం మన పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు.

➡ ఓటరు వివరాలను తెలుసుకోవడానికి ఓటరు మొబైల్‌యాప్ అందుబాటులో ఉంది. ప్లే స్టోర్ నుంచి నేరుగా voterhelaplineను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు ఇచ్చి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తరువాత అందులో ఫోన్ నంబర్‌తో లాగిన్ అయి పాసు వర్డు సెట్ చేసుకోవాలి. అనంతరం ఎలక్ట్రోల్ రోల్ అనే అంశంపై క్లిక్ చేస్తే సెర్చ్ బై మొబైల్, సెర్చ్ బై బార్/క్యూఆర్‌కోడ్, సెర్చ్ బై డిటేల్స్, సెర్చ్ బై ఎపిక్ నంబర్ సబ్ టైటిల్ డిస్‌ప్లే అవుతాయి. అందులో ఏ వివరాలు ఇచ్చి ఎంటర్ అయినా జాబితాలో పేరు ఉందో లేదో తెలిసిపోతుంది.

అక్రమంగా తొలగిస్తే....

ఓటరు జాబితాలో మీ పేరు కనిపించకపోయినా, కావాలనే తొలగించినా జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించే కలక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఆమె విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

పేరు లేకపోతే..

ఓటరు జాబితాలో పేరు లేకపోతే కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ స్వీకరణకు నిర్దేశించిన తుది తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో ఓటు నమోదుకు అవకాశం ఉంటుంది. ఓటు హక్కు నమోదు సహా ఇతరత్రా ఏమైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

ఇటీవల తుది ఓటరు జాబితాను విడుదల చేశాం. అన్ని పోలింగ్‌కేంద్రాలు, ఆర్‌డీఓ, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ జాబితాను అందుబాటులో ఉంచాం. జాబితాలో పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలి. ఏదైనా కారణాలతో పేరు తొలగించినా...తీసి వేసినా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. విచారణ చేసి ఓటు హక్కు కల్పిస్తాం. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి.

– డాక్టర్ జి.సృజన, జిల్లా ఎన్నికల అధికారి

క్లుప్తంగా

అమ్మాయిలు కూడా రక్తదానం చేయాలి


రక్తదాతలను అభినందిస్తున్న సుమన్

కర్నూలు(హాస్పిటల్): అమ్మాయిలు కూడా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని డేనియల్ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుమన్ కోరారు. ఆదివారం స్థానిక వెంకటరమణ కాలనీలోని విశాల్ మార్ట్ వారితో కలిసి డేనియల్ రాజు ఫౌండేషన్ వారు వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో స్టోర్ మేనేజర్ డేనియల్, హసీనాతో పాటు 35 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సుమన్ రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. కార్యక్రమంలో జ్యోతి, మానస, సునీల్, గౌస్, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్‌టీకే నాయక్, తదితరులు

కర్నూలు(అర్బన్): ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామని రాయలసీమ విశ్వ విద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక టీఎస్‌ఎఫ్ కార్యాలయ ఆవరణలో ఫిబ్రవరి 5,6 తేదిల్లో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. టీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రజా రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి పాలక ప్రభుత్వాలు ఎంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ మహోత్సవాలు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ఉంటాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీ వెంకటేష్, నాయకులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ విడుదల


డైరీని విడుదల చేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2024 డైరీని ఆ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి విడుదల చేశారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. నెల్లూరులోని వ్యవసాయ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగనాథబాబు, చైర్మన్ శేషారెడ్డి, రాష్ట్ర నేత పాపయ్య నాయుడు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్షరం పురస్కారం ప్రదానం


రచయిత ప్రసేన్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: అక్షరం లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షరం–2024 పురస్కారాన్ని ప్రముఖ కవి ప్రసేన్‌కు ప్రదానం చేశారు. ఆదివారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ప్రముఖ కవి కాశీభట్ల వేణుగోపాల్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సాహితీ వేత్తలు వెంకటకృష్ణ, మారుతి మాట్లాడుతూ కవిగా విమర్శకుడిగా ప్రసేన్ అనేక ప్రయోగాలు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు ఉమానాథరావు, కృష్ణమోహన్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగారమోహన్, కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, విరసం నాయకులు నాగేశ్వరాచారి, రయితలు ఇనాయతుల్లా, కల్యాణదుర్గం స్వర్ణలత, స్వయం ప్రభ, సీవీ శ్రీనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో భక్తుల రద్దీ

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం స్వామి వారికి ప్రతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్‌లు నిండిపోయాయి. స్వామి వారి దర్శనానికి గంటలకుపైగా సమయం పట్టింది. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. అంతేకాక స్వామి వారి దర్శనమనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేసినట్లు చెప్పారు.

మహానగరంగా అభివృద్ధి



అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమానికి హాజరైన నగర ప్రజలు, శిలాఫలకం ఆవిష్కరణలో మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్,కమిషనర్ భార్గవ్‌తేజ

- కర్నూలు నగరంలో పెద్ద ఎత్తున ప్రగతి పనులు
- టూరిజం స్పాట్‌గా కొండారెడ్డి బురుజు
- నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వెల్లడి
- కొండారెడ్డి బురుజు వద్ద వివిధ అభివృద్ధి పనుల ప్రారంభం
- అబ్బుర పరచిన 3 డి లేజర్ షో

కర్నూలు (టౌన్): కర్నూలును మహానగరంగా తీర్చిదిద్దేందుకు వందల కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. కొండారెడ్డి బురుజు వద్ద రూ. 2 కోట్లతో వివిధ ప్రగతి పనులు చేపట్టారు. కొండారెడ్డి బురుజు ప్లాజా, పార్కు, ఫుడ్ కోర్టు 3 డి లేజర్ షో తదితరవి అందులో ఉన్నాయి. ఆదివారం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, కర్నూలు రేంజ్ డిఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ క్రిష్ణకాంత్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకాతో కలిసి మేయర్, ఎమ్మెల్యే వాటిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ కర్నూలు అంటే కొండారెడ్డి బురుజు గుర్తుకు వస్తుందన్నారు. అయితే, గత పాలకులు ఈ చారిత్రక కట్టడాన్ని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు తాము హైదరబాద్‌లో చార్మినార్ తరహాలో రూ. 2 కోట్లు వెచ్చించి అందంగా తీర్చిదిద్దామన్నారు. అంతేకాకుండా బురుజు చుట్టుపక్కల వివిధ అభివృద్ధి పనులతో టూరిజం స్పాట్ చేస్తున్నామన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో నగరంలో ఊహించని అభివృద్ధి జరిగిందన్నారు. స్వచ్ఛతలో 197 స్థానంలో ఉన్న కర్నూలు ఇప్పుడు 36 వ స్థానానికి ఎగబాకిందన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి నగర రూపురేఖలు మార్చామన్నారు. రూ.500 కోట్ల తో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునికీకరించామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సుంకేసుల నుంచి సమ్మర్ స్టోరేజీ వరకు రూ.82 కోట్లతో పైపులైన్ పనులు, నగరంలో అందమైన పార్కులు, కాలనీల్లో పెద్ద ఎత్తున్న మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. హైదరాబాద్-బెంగళూరు కారిడార్, ఓర్వకల్ ఇండస్ట్రియల్ కారిడార్, బ్రిడ్జి నిర్మాణాలు, ఇండోర్ స్టేడియాలు, క్రికెట్, టెన్నిస్, బాస్కెట్‌బాల్ కోర్టుల ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కర్నూలును తమ ప్రభుత్వం న్యాయరాజధానిగా ప్రకటించి మానవహక్కుల కమిషన్, లోకాయుక్తా, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు చేసిందన్నారు. త్వరలో లా యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న


శివ భక్తులకు అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్) : అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని శ్రీశైల సత్రంలో శివభక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ శివభక్తులకు నేటి నుంచి శివరాత్రి వరకు అన్నదానం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. నిర్వాహకులు వెంకటస్వామి గౌడ్, గురుస్వామి, బైండింగ్ ఏజెన్సీ నాగరాజు, రవిగౌడ్, గోవిందరాజులను మాజీ ఎమ్మెల్యే అభినందించారు.

10 నుంచి హాకీ పోటీలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 10 వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు కార్యదర్శి దాసరి సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 జట్లు పాల్గొంటున్నాయని, లీగ్-కమ్-నాకౌట్ పద్ధతిలో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

ఉద్యాన పంటలపై అవగాహన కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ అదనపు పీడీ రాజాకృష్ణారెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన పెంచాలని ఏపీఎంఐపీ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రాజాకృష్ణారెడ్డి ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు. వర్షాభావం ఉన్న ప్రాంతాల్లో ఉద్యాన పంటల కింద కూరగాయలు, పండ్ల తోటల సాగు బాగ కలసి వస్తుందని పేర్కొన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఉద్యాన పంటల సాగు అవసరమని వివరించారు. ఈ పంటల సాగుకు ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దేశీ కార్యక్రమ సమన్వయ కర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... రైతులు దాదాపు అన్ని అవసరాలకు ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తున్నారని, వారికి చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

మహానందిలో 1న టెండర్లు

మహానంది: మహానందిలో ఫిబ్రవరి ఒకటవ తేదీన వివిధ అంశాలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నవగ్రహాల వద్ద దీపారాధన సామగ్రి విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, వాహన పూజలు జరిపించుకునే లైసెన్సు హక్కులతో పాటు మరి కొన్ని అంశాలకు వేలాలు ఉంటాయన్నారు. సీల్డు, ఈ- ప్రొక్యూర్‌మెంట్, బహిరంగ వేలాల విధానాల్లో టెండర్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఓంకారంలోనూ టెండర్లు

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారం ఆలయంలో ఫిబ్రవరి ఒకటవ తేదీన టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు, టెంకాయల విక్రయానికి, ఐస్ క్రీమ్ బండ్లు పెట్టుకునేందుకు, కూల్ డ్రింక్స్ అమ్మకానికి టెండర్లు ఉంటాయన్నారు. టెండర్లలో పాల్గొనాల్సిన వారు రూ.10,000 డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

సమాజ చైతన్యానికి రచనలు దోహదపడాలి

- పుస్తకావిష్కరణలో సాహితీ వేత్తలు


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్: సమాజ చైతన్యానికి రచనలు దోహదపడాలని పలువురు వక్తలు, సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. తెలుగు భాషా వికాస ఉద్యమం, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు, రచయిత్రి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి రచించిన 'రసస్యందిని' సాహిత్య వ్యాసాల సంపుటి, మనలోమాట రేడియో వ్యాసాల సంపుటిల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగింది. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, కజిరసం అధ్యక్షుడు గన్నమరాజు సాయిబాబా పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. రచనల ప్రజల్లో మార్పు తీసుకొచ్చేలా ఉండాలన్నారు. భావితరాలకు మార్గదర్శకం చేయాలన్నారు. డాక్టర్ హరికిషన్, సురేష్‌బాబు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో నరసం అధ్యక్షులు వెంకటసుబ్బలక్ష్మమ్మ, మాటిస్సోరి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, రంగనాథ్, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, లక్ష్మయ్య, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): సున్నిపెంట లింగాల గట్టు మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం లింగాలగట్టు వద్దనున్న దిగువ శ్రీశైలం ప్రాజెక్టులో విషవాయువు కలిసి టన్నుల కొద్ది చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. చేపల వేటతో ఉపాధి పొందుతున్న వంద వాల్మీకి (మత్స్యకారులు) కుటుంబాలు తీవ్రంగా నష్టపోయారన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : విరివిగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని రిటైర్డు డీఎఫ్ఓ జయచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ నగర్‌లోని సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చి పాస్టరేట్ చర్చిలో ఆయన మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపొందించాలన్నారు. గ్రీన్ సిటీ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో పాస్టరేట్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ సామ్యూల్ పీటర్, చర్చి సంఘం కార్యదర్శి జి.సుదర్శనరావు, కోశాధికారి వినోద్‌బాబు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య


రేణుక (ఫైల్)

కర్నూలు: పాతబస్తీలోని ఖండేరి వీధిలో నివాసం ఉంటున్న తెలుగు రేణుక తుంగభద్ర నదిలో పడి ఆత్మ హత్య చేసుకుంది. ఈమె భర్త రాజు చనిపోవడంతో మెట్టినింట్లో గొడవ పడి ఈ నెల 26వ తేదీన ఇంటినుంచి బయటికి వెళ్లింది. ఆదివారం ఉదయం కాలనీ సమీపంలోని తుంగభద్ర నదిలో శవమై కనిపించింది. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీస్‌లు అక్కడికి చేరుకొని మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆత్మ హత్యకు దారి తీసిన కారణాలపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అశోక్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు: స్థానిక అశోక్‌నగర్‌లో గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న ఆదినారాయణరెడ్డి సతీమణి ప్రభావతమ్మ, ఆదివారం పనిమీద బయటికి వెళ్లి తిరిగి నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా ట్రినిటీ స్కూల్ దగ్గర ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ఆమెను సమీపించి మెడలో ఉన్న ఐదున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు. ఆమె అప్రమత్తమై కేకలు వేసేలోగా వాహనం వేగం పెంచి కనపడకుండా పారిపోయారు. ఈమేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల అభ్యున్నతికి జగనన్న కృషి


పొదుపు మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు: మహిళల అభ్యున్నతికే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలను విడతల వారీగా మాఫీ చేశారన్నారు. ఆదివారం పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద నాల్గో విడత సంబరాలు జరిగాయి. పట్టణంలోని 372 సంఘాల్లోని 3,737 మంది సభ్యులకు రూ.9,0037,102 మంజూరు కాగా ప్రస్తుత నాల్గో విడతకింద రూ. 2,25,09,112 మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును అధికారులతో కలిసి మహిళల కు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమ యం కావడంతో రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని వాటిని నమ్మొద్దని ప్రజలను కోరారు. అలాగే రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్ పార్టీతో చేరి షర్మిల విమర్శలు సంధించడం ఎంతవరకు సబబ ని ప్రశ్నించారు.షర్మిల ముసుగులో చంద్రబాబు రాష్ట్రంలో కొత్త నాటకానికి తెర తీశాడని, ఆ నాటకానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా జగనన్న విజయాన్ని అడ్డుకో లేరని స్పష్టం చేశారు. జనం మదిలో జగనన్న శాశ్వత స్థానం ఏర్పాటు చేసుకున్నారని, వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, మరోసారి ఫ్యాన్ ప్రభంజనం చాటడం ఖాయమన్నా రు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న,మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, మెప్మా సీఎంఓ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి.ఆబేల్, కే.నాగులాపురం నరసింహారెడ్డి, చనుగొండ్ల మహేశ్వరరెడ్డి, మునుగాల రామాంజనేయులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

కర్నూలు(సెంట్రల్) : పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సోమవారం కర్నూలు రానున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్‌మస్తాన్‌వలి తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెంకటరమణ కాలనీలోని తనిష్క్ ఫంక్షన్ హాలులో జరిగే కర్నూలు, నంద్యాల జిల్లాల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొంటారన్నారు. సమావేశంలో నాయకులు ఎం.సుధాకరబాబు, బతుకన్న, రియాజుద్దీన్, సత్యనారాయణగుప్తా పాల్గొన్నారు.

వైద్యులపై దాడులను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవికృష్ణ

- ఐఎంఏ పూర్వ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

కర్నూలు(హాస్పిటల్): వైద్యులపై దాడులను అరికట్టాలని, ఇందుకు చట్టాన్ని సవరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ కోరారు. ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్-3 స్థాయి వైద్యులకు వర్క్‌షాప్‌ను కర్నూలులోని ఐఎంఏ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైద్యులపై దాడులను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం సరైన దృష్టి కేంద్రీకరించాలన్నారు. గతంలో ముసాయిదా చట్టాన్ని తీసుకొచ్చినా కేంద్ర హోంశాఖ దాన్ని అడ్డుకుందన్నారు. వైద్యులపై దాడలు చేసిన వారికి ఏడేళ్ల శిక్ష పడేటట్లు చట్టాన్ని సవరించాలని కోరారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఏకగవాక్ష విధానం ఉండాలని ముఖ్యమంత్రిని కోరితే సానుకూలంగా స్పందించారన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్యరంగానికి జీడీపీలో కేటాయింపులు పెంచాలని, ప్రైవేటు ఆసుపత్రులకు గుర్తింపును పట్టణ, గ్రామ స్థాయిలను దృష్టిలో ఉంచుకుని ఇవ్వాలని కోరారు. ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిదర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1,764 ఐఎంఏ శాఖలు ఉన్నాయన్నారు. ఈ నెల 30వ తేదిన కోవిడ్‌లో అమరులైన వైద్యుల దనిదోత్సంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కోవిడ్‌లో 124 మంది వైద్యులు మరణించారన్నారు. ఆ రోజున వారికి నివాళులు అర్పించి వారి సేవలను స్మరించుకుంటామన్నారు. ప్రజలకు మందుల ఖర్చు అధికమైందని, కేంద్ర ప్రభుత్వం మందుల ధరలను స్థిరీకరించాలని కోరారు. సమావేశంలో ఐఎంఏ పూర్వ అధ్యక్షులు డాక్టర్ కిశోర్, డాక్టర్ బాలమద్దయ్య, ఉపాధ్యక్షులు డాక్టర్ బాలరాజు, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ విజయభాస్కరరెడ్డి, కర్నూలు ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ రామచంద్రనాయుడు, ఉపాధ్యక్షులు డాక్టర్ కె. శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశానికి భారీ షాక్


ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన తడకనపల్లెకు చెందిన టీడీపీ శ్రేణులు

- తడకనపల్లెలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండలంలో టీడీపీకి షాక్ తగిలింది. తెలుగుదేశంలో ఎంత కష్టపడినా గుర్తింపు లేదని మండల పరిధిలోని తడకనల్లె గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రాముడు, మాదమ్మ, సంజీవయ్య, సంతోషమ్మ, లక్ష్మన్న, లక్ష్మీదేవి, వేణుగోపాల్, రామాంజనేయులు, లక్ష్మీదేవి, ఆంజనేయులు, మాదేవి, సంజీవయ్య, అఖిల, చిట్టెమ్మ, సంధ్య, వెంకటేశ్వరమ్మ, స్వాములు, భాస్కర్‌లకు ఎమ్మెల్యే కాటసాని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమపాలన, వెనుకబడిన వర్గాలకు కల్పిస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితులై పార్టీలో చేరడం ఆనందరంగా ఉందన్నారు. ఇప్పటికే 50 శాతం నామినేట్ పదవుల్లో బీసీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు.

వావ్.. కొత్తిమీర!

- నగరంలో టెర్రస్ గార్డెన్‌లో కొత్తిమీర సాగు
- ఏకంగా 4 అడుగుల మేర పెరిగిన మొక్కలు


టెర్రస్ గార్డెన్‌లో పెరిగిన కొత్తిమీర మొక్కలను చూపుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): నేలలో సారం బాగా ఉంటే కొత్తిమీర గరిష్టంగా రెండు అడుగుల వరకు పెరుగుతుంది. అయితే, టెర్రస్ గార్డెన్‌లో రికార్డు స్థాయిలో కొత్తిమీర నాలుగు అడుగుల మేర ఎత్తు పెరిగి అబ్బురపరుస్తోంది. కర్నూలు నగరం లక్ష్మీ నగర్‌లో నివాసం ఉండే దంపతులు గుజరాతీ ఎల్లప్ప, సుష్మ టెర్రస్ గార్డెన్‌లో అద్భుతంగా రాణిస్తున్నారు. గార్డెన్‌లో ఆకుకూరలు, కూరగాయలతో పాటు పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలు, పూల మొక్కలు ఉన్నాయి. మొత్తం 200 మొక్కలతో వారి టెర్రస్ గార్డెన్ కళకళలాడుతోంది. 70 రోజుల క్రితం ఎల్లప్ప దంపతులు హైబ్రిడ్ రకానికి చెందిన కొత్తిమీర విత్తనాల (ధనియాలు)ను ఆన్‌లైన్ ద్వారా తెప్పించి వాటిని ప్లాస్టిక్ టబ్‌లో ఎర్ర, నల్లరేగడి మట్టిని మిక్స్ చేసి నాటారు. వర్మి కంపోస్టు, పశువుల ఎరువు, కిచెన్ వ్యర్థాలను వినియోగించారు. రోజురోజుకు ఏపుగా పెరుగుతూ వచ్చిన ఈ మొక్కలు ప్రస్తుతం 46 ఇంచుల పొడవు (నాలుగు అడుగులు) పెరిగి అందరినీ అబ్బురపరుస్తున్నాయి. ఏపుగా పెరిగి సువాసనలు వెదజల్లుతుండటంతో ఎల్లప్పదంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిద్ధం పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: రాయలసీమ జిల్లాల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తన నివాసంలో విడుదల చేశారు. ఫిబ్రవరి 3వ తేదీన అనంతపురం జరిగే సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యతో పాటు విలువలను అలవర్చుకోవాలి


మెరిట్ విద్యార్థినికి ఉపకార వేతనాలు అందిస్తున్న రామచంద్ర ప్రభు

కర్నూలు(అర్బన్): విద్యార్థులు విద్యతో పాటు విలువలతో కూడిన దేశభక్తిని అలవర్చుకోవాలని శ్రీ కృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు అన్నారు. ఆదివారం స్థానిక టీజీవీ కళా క్షేత్రంలో రాయల్ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) ఆధ్వర్యంలో జిల్లాలోని 123 మంది బలిజ మెరిట్ విద్యార్థినీవిద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా బలిజ మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలుఅందిస్తున్నామని, ఇప్పటి వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.21 కోట్లను ట్రస్ట్ నుంచి అందించామన్నారు. ఉపకార వేతనాలు పొందిన వారు ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి ఉపయోగపడే విధంగా మంచి రంగాల్లో స్థిరపడాలన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి క్రమశిక్షణ, దేశ భక్తి, సేవా గుణం అలవరచుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో రోపా సభ్యులు, బలిజ సంఘం నేతలు డా.వై సత్యనారాయణ, డా.కుల్లాయప్ప, కోనేటి చంద్రబాబు, పత్తి ఓబులయ్య, శెట్టి విజయ కుమార్, కొట్టే చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.